# మాట్లాడని మల్లెమొగ్గ

డా. తంగిరాల మీరాసుబ్రహ్మణ్యం

మూర్తి సైకిల్ బెల్ విని ఉలికిపడ్డాను.

నిస్సంకోచంగా, నిర్లజ్జగా నా ఒంటి ఒంపులను చూపులతో తడిమేస్తూ నిలబడ్డాడు.

ఒకసారి భార్య సీతతో రాగా చూశాను అతగాడిని.

సీత కళ్లలో ఆ దిగులెందుకో అర్థమయ్యింది. జీవం తొణికిసలాడే భార్య అందం చీకట్లో తప్ప అక్కర్లేని నపుంసకుడు మూర్తి.

నడుము ఒంపునూ, వక్షోజ సౌందర్యాన్ని బహిర్గతం చేస్తూ అలంకరించుకుని నిలబడ్డ నన్ను మాత్రం ఆకలిగా చూస్తాడు.

టైము పదిన్నర. ఈ సరికి నీలి రంగు స్కూటరు ఈ వీధి మలుపు తిరగాలే.. ఇవాళెందుకు అలస్యం?

అదిగో అఫ్జల్ అనుకుంటుండగానే వచ్చింది స్కూటరు. అతడు బండి నడిపే తీరు చూస్తే యాక్సిడెంట్ చేస్తాడని భయం వేస్తుంది నాకు.

అంతదూరం నుండి నన్నే చూస్తూ వస్తాడు. నన్ను దాటి వెళ్లే దాకా ఇటువైపే ఉంటుంది అతని దృష్టి.

రోజూ చూస్తూనే ఉన్నా ఇవాళే క్రొత్తగా చూస్తున్నట్టు... నాలో అందం ఏ ఒంపులో దాక్కుందో పరిశీలిస్తున్నట్లు తనకు ఏం కావాలో నిర్ణయించుకున్నట్టు పై నుండి క్రింది దాకా చూపులతో స్పృశిస్తాడు.

తమాషాగా అతని చూపులు నాలో ఏ కలవరాన్ని కలిగించవు.

ఆ కళ్లలో వాంఛ కన్నా ఇష్టం ఎక్కువ కనబడుతుంది.

నాలో తన కాబోయే భార్యను ఊహించుకుంటాడు.

ఏ రోజైనా నేను కట్టిన చీరే అతనికి నచ్చకపోతే ఆ ముఖంలో కనబడే ఆశాభంగం చూస్తే నవ్వొస్తుంది.

రేపొద్దున్న పెళ్లయ్యాక ఆవిడ తన అభిరుచి మేరకే అలంకరించుకోమని శాసిస్తాడేమో.

అఫ్జల్‌ది అభిరుచి అయితే మూర్తిది లేకితనం అనాలి.

నన్ను చీర లేకుండానే ఊహించుకుంటాడుగానీ సీత ఒయ్యారాల్ని కనులారా ఆస్వాదించడం చేతకాదు.

వీళ్లిద్దరి కన్నా విమలను చూస్తే నాకు విచిత్రంగా ఉంటుంది.

అదిగో.. ఆవిడ రానే వస్తూంది ఇటువైపు.

నన్ను చూచీ చూడనట్టు ముఖం తిప్పుకుంది.

అందంగా ఒయ్యారంగా ఉండటం ఏదో పాపమన్నట్టు ముఖం చిట్లించింది.

చిరునవ్వు చిలకరించడం తప్ప గట్టిగా నవ్వలేను గనుక ఊరుకున్నాను. లేకుంటే ఆవిడ కళ్లలో అసూయ చూస్తే పగలబడి నవ్వాలనిపిస్తుంది నాకు.

ఎంత హృదయం లేనిదాన్నయినా మరీ ఇలా ఆలోచించకూడదనుకుంటా.

పాపం విమల మాత్రం ఏం చేస్తుంది? ముప్పై వసంతాలు కోయిల కూయకుండానే గడిచిపోయాయి.

ఛామన చాయ నలుపులోకి మారి, యవ్వనపు మిసమిసలు వదలిపోతున్నాయి.

ఎన్నేళ్లుగా చూస్తున్నా ఏ మార్పు లేని నన్ను చూసి అసూయ పడిందంటే సహజమే మరి.

అయినా ప్లాస్టిక్ పువ్వు అందాన్ని చూసి జీవం తొణికిసలాడే గడ్డిపువ్వు అయినా ఆసూయపడ్డం అనవసరం కదూ!

విమల మీద నుండి నా ఆలోచనలు పారిజాతం మీదికి మళ్లాయి.

ఈసరికి కాళ్లీడ్చుకుంటూ రావల్సింది. ఎంచేత రాలేదో?

తల్లి ఆరోగ్యం క్షీణించిందో, తమ్ముడు మరో గొడవేదైనా ఇంటిమీదకి తెచ్చేడో! నవ వికసిత పారిజాతంలా ఉండాల్సిన కన్నెపిల్ల. వాడిన పువ్వులా ఎప్పుడూ దిగులుగా, గంభీరంగా ఉంటుంది పాపం.

నలిగిపోయిన వాయిలు చీరె తప్ప మంచి చీరె ఏనాడూ కట్టగా చూడలేదు.

రోజుకో చీరెలో హొయలు ఒలకబోసే నన్ను చూచి కూడా గమనించనట్టే నడిచిపోతుంది.

"ఎంత అహంకారం" అని కోపం రాదు నాకు చిత్రంగా.

జీవితాన్ని కలలా గడిపే ఈ కాలం ఆడపిల్లలకు భిన్నంగా కన్నీళ్లనూ కష్టాలనూ కలిపి తాగేసి నిండుగా ప్రవహించే నదిలా నిశ్చలంగా కనబడుతుంది పారిజాతం.

నాకేమనిపిస్తుందంటే నేను కట్టే చీరెలన్నీ ఆ పిల్లకిచ్చేసి, తడి చేపల్లా కదిలే ఆ కళ్లలో సంతోషం చూడాలని.

కానీ ఆ అధికారం నాకెక్కడిది? నా శరీరం మీదే మమకారమూ అధికారము లేనిదాన్ని.

ఒకరి ఆనందం కోసం, ఔన్నత్యం కోసం నా శరీరాన్ని అందాన్ని అద్దెకిచ్చినదాన్ని.

నాకొక మనసూ, ఆలోచనా, ఆవేదనా, అభిమానము ఉంటాయని వీళ్లెవ్వరికీ అనిపించదనుకుంటా.

నా అందానికి రోజూ మెరుగులుదిద్దే నాగరాజు వస్తున్నాడు.

అతని చేతులు నన్ను తాకినప్పుడు ఒకవేళ నాకు తండ్రి ఉంటే అతని స్పర్శ ఇలా ఉండేది కాబో లుననిపిస్తుంది నాకు.

శిల్పాన్ని చెక్కిన శిల్పి ఎంత అపురూపంగా తన కళారూపాన్ని కాపాడుకుంటాడో అలా నా ఒయ్యారానికి మెరుగులు దిద్దుతాడు. కుచ్చిళ్లలో ఒక మడత పడినా, పయ్యెద సర్దడంలో ఏకాస్త ఏమారినా తల్లడిల్లిపోతాడు.

మరల మరల సర్దుతాడు. సర్ది సర్ది పుట్టినరోజు పాపాయిని తనివితీరా చూసుకునే తల్లిలా కనులనిండుగా చూస్తాడు.

నాగరాజు రాని రోజుల్లో నా డ్యూటీ రాంబాబు తీసుకుంటాడు.

పరాయి చూపుల నుండి నా నగ్నత్వాన్ని కాపాడాలని అతను పడే తాపత్రయం చూస్తే నవ్వొస్తుంది.

నా సింగారం ముగిసేదాకా ఎవ్వరినీ అటు రానివ్వడు రాంబాబు.

తను కూడా నావైపు క్షణం కాలం చూసి ఎరగడు. చెల్లిని కాపాడే అన్నలా నా మర్యాదను చీరెలో దాస్తాడు. నా స్త్రీత్వం మరొకరి కంటబడటం సహించడు.

నాగరాజు, రాంబాబు ఇద్దరూ ఏ కారణంగానైనా రాని రోజు నేను డేవిడ్ పాలబడతాను.

నా అసహాయతను పూర్తిగా వాడుకుంటాడు డేవిడ్. నన్ను అలంకరించే నెపంతో నా శరీరంలో అణువణువూ తాకుతాడు.

అతని స్పర్శ నా శరీరానికి తెలియకపోయినా మనసుకు తెలుస్తుంది.

మనసంతా వెగటుగా జుగుప్సతో నిండిపోతుంది.

కాంక్ష నిండిన కన్నులతో నన్ను తినేస్తూ వాంఛాపూరితమైన స్పర్శతో నన్ను కాల్చివేస్తాడతను.

అయినా నా ముఖంలో చిరునవ్వు చెదరదు. కన్నులలో తడి ఊరదు.

"ఆడదాని అందాన్ని ప్రదర్శనకు పెట్టి వ్యాపారం పెంచుకునే ఈ దరిద్రపు సంస్కృతి ఎక్కడి నుండి వచ్చింది?"

అమ్మ, అక్క, చెల్లి, ప్రియురాలు, భార్య- ఎన్నో రూపాలలో తన జీవితానికి ఆలంబనగా నిలిచే స్త్రీ అందాన్ని అంగడి బొమ్మగా నిలబెట్టి అంగాంగంలో ఒయ్యారం అలంకరించి డబ్బు చేసుకునే ఈ కుసంస్కృతిని ధిక్కరించి ప్రశ్నించే చైతన్యం ఆడవాళ్లలో లుప్తమైపోయిందెందుకని?" నిట్టూర్చింది మధూలిక అద్దాల పెట్టెలోని బొమ్మను చూస్తూ.

"ఏమిటంత దీర్ఘాలోచన?" మధూలికను పలుకరించాడు మోహన్.

మధూలిక పలుకలేదు. "నాకు తెలుసులెండి ఆ బొమ్మకు మనసనేది ఉంటే ఈ మనుషుల గురించి ఏమనుకుంటుంది? వారి ప్రవర్తనకు ఎంత బాధపడుతుంది? అనే కదూ?" అన్నాడు.

"జీవమున్న బొమ్మను నేను. భుక్తి కోసం ఇదే షాపులో పనిచేస్తున్నాను కదా. జీవంలేని ఆ బొమ్మకే గనుక బ్రహ్మదేవుడు నాలుగు రోజుల పాటు ఆలోచించే శక్తి ఇస్తే ఎలా ఫీలవుతుంది అని చాలాసార్లు అనుకుంటాను."

విషాదంగా నవ్వింది మధూలిక.

○



